క్లుప్తంగా

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి



చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు తమ సేవలను విస్తృతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. గ్రామంలోని రెవ. జయపాల్ పిలిప్ సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు బుధవారం బియ్యం, కారియర్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయపాల్ విదేశాలలో ఉంటూనే పరిసర గ్రామాల ప్రజలకు తన వంతు సహకారం అందిస్తున్నారన్నారు. సేవలను మరింత విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం సమీపంలోని వరి పొలంలో ఉదయభాను నాట్లు వేసి ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కుంచపు నారాయణ, గ్రామ నాయకులు బుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేరళ పాపులేషన్ రీసెర్చ్ బృందం సందర్శన



నందిగామ: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని కేరళ కి చెందిన పాపులేషన్ రీసెర్చ్ టీం సభ్యులు బుధవారం సందర్శించారు. వైద్య ఆరోగ్యశాఖలో జాతీయ కార్యక్రమాలు అమలవుతున్న తీరు పరిశీలనలో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా కేరళ వైద్యుల బృందం పరిశీలనకు వచ్చారు. కేరళకు చెందిన ఓమెన్ మ్యాథ్యూ, కె.వి సచిన్‌లు ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. రోజూ ఆసుపత్రికి ఎంతమంది రోగులు వస్తున్నారు, వారికి పూర్తి స్థాయిలో సేవలు అందుతున్నాయా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలోని అన్ని రకాల ఆధునిక వసతులను పరిశీలించారు. డాక్టర్ నవీన్ కేరళ బృందానికి వివరాలు వెల్లడించారు. వారి వెంట పలువురు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ



గొట్టుముక్కల(కంచికచర్ల):మండలంలోని గొట్టుముక్కల ఎంపీపీ స్కూల్‌ను మండల విద్యాశాఖాధికారి బీ బాలాజీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల పరిసర ప్రాంతం పరిశీలించారు. ఏజెన్సీ నిర్వాహకులు వంట చేసే విధానం, మెనూ ప్రకారం భోజనం తయారు చేస్తున్నారా లేదాని విచారించారు. టాయిలెట్స్, తాగునీరు ట్యాంకు శుభ్రంగా ఉందా లేదాని పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు సమష్టిగా పనిచేయాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా అందించాలని, శుద్ధిచేసిన తాగునీరు విద్యార్థులకు సరఫరా చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగానే ఉందని విద్యార్థులు అనటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. హెచ్ఎం కే నాగేశ్వరరావు, ఎస్.కిషోర్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆర్టీఏ నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ వాహనాలను నడపాలని ఎస్ఎన్ పురం ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ ఆటోడ్రైవర్లను ఆదేశించారు. నగర పోలీస్ కమిషనర్ టి.కె.రానా ఉత్తర్వుల ప్రకారం డీసీపీ విశాల్‌గున్ని, ఏసీపీ సీహెచ్ రవికాంత్‌ల ఆదేశాల మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆటో డ్రైవర్లకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకట నారాయణ ఆటో డ్రైవర్లు డ్యూటీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలను వివరించారు. ముఖ్యంగా డ్రైవర్లు ఆటో నడిపేటప్పుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆటో రికార్డులు కలిగి ఉండాలన్నారు. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని, ఎవరైనా ప్రయాణికులు తమ లగేజీలను ఆటోలో మర్చిపోతే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించినప్పుడు వారి సమాచారం పోలీసులకు అందించాలని చెప్పారు.

రక్షిత తాగునీరు అందించేందుకు కృషి

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- రెండు గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణానికి శంకుస్థాపన



ఓహెచ్ ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: గ్రామీణ ప్రాంత ప్రజలకు రక్షిత మంచి నీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని మునగచర్ల గ్రామంలో చందర్లపాడు మండలంలోని పొక్కునూరు గ్రామంలో చేపట్టనున్న ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ 40 వేల లీటర్ల సామర్థ్యమున్న వాటర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మునగచర్ల గ్రామంలోని ట్యాంకుకు రూ.44 లక్షలు, పొక్కునూరు గ్రామంలో నిర్మిస్తున్న ట్యాంకుకు రూ.43.75 లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ పట్టణంతో పాటు నాలుగు మండలాల పరిధిలో పూర్తి స్థాయిలో మంచి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామని జగన్‌మోహనరావు తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

స్థల దాతలకు సత్కారం..

మునగచర్ల గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా అందజేసిన ఘంటా వెంకటేశ్వరరావు దంపతులను ఎమ్మెల్యే జగన్‌మోహనరావు అభినందించి ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీ ఆకుల రంగ, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కొమ్మినేని మహేంద్ర, షేక్ కరిముల్లా, వీరభద్రయ్య, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వాహనాల అందజేత



దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: దివ్యాంగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రకాలుగా అండగా ఉంటున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు నూరు శాతం రాయితీపై ప్రభుత్వం మంజూరు చేసిన మూడు చక్రాల మోటార్ వాహనాలను స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ దివ్యాంగులలో ప్రతిభను గుర్తించి వారికి తగినట్లుగా ఉపాధి కల్పించేందుకు కూడా ప్రభుత్వ కృషి చేస్తుందని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ సహకార సంస్థ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించి అర్హులను గుర్తించి నియోజకవర్గానికి 10 చొప్పున వాహనాలను మంజూరు చేసిందని, వీటిలో నాలుగు వాహనాలను అందజేస్తున్నామన్నారు. ఆర్డీవో రవీంద్ర, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ కమిషనర్ జయరాం, తహసీల్దార్ నరసింహారావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు షేక్ కరిముల్లా, యాకుబ్ అలీ, షేక్ ఖాలిక్, నాదెండ్ల నరేంద్ర, జాఫర్, అనుమోలు సారధి, బండారు వెంకట్రావ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహిళా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఏసీపీ హనుమంతరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సచివాలయాల్లోని మహిళా పోలీసులు సమాజంలో మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజయవాడ వెస్ట్ ఏసీపీ కె.హనుమంతరావు ఆదేశించారు. వెస్ట్ డివిజన్ పరిధిలోని వన్‌టౌన్, కొత్తపేట, భవానీపురం, ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ల పరిధిల్లోని వివిధ సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీసులతో రాయల్ కన్వెన్షన్‌లో బుధవారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. ఆయా సచివాలయాల పరిధిల్లో పని చేస్తున్న మహిళా పోలీసులు మహిళా సమస్యలను గుర్తించాలన్నారు. వాటిని తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతేకాకుండా మహిళల వివాదాలకు సంబంధించి మహిళా పోలీసుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను, అందులో మహిళా పోలీసులను ఏర్పాటు చేసిందన్నారు.

మహిళా సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన మహిళా పోలీసులు ప్రభుత్వం లక్ష్యాలను నెరవేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు సురేష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ పార్కు అభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర
- రూ.5 లక్షలతో టాయిలెట్ల నిర్మాణం



టాయిలెట్ల నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో సామినేని విశ్వనాథం మున్సిపల్ పార్కును అభివృద్ధి చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పార్కు సందర్శకులు, ఆర్టీసీ బస్టాండుకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న టాయిలెట్ల నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ పార్కులో ఉన్న గ్రీనరీని మరింత మెరుగు పరచనున్నట్లు తెలిపారు. పార్కులో పిల్లలు ఆడుకోవడానికి చిల్డ్రన్స్ జోన్‌లో, ఓపెన్ జిమ్‌లో మరిన్ని సదుపాయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను సహకారంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి శ్రీకారం చుడుతూ జగ్గయ్యపేట పట్టణాన్ని క్లీన్ జగ్గయ్యపేటగా తీర్చిదిద్దుతామన్నారు. 9వ వార్డులో నిర్మాణం పూర్తయిన రోడ్డును పరిశీలించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, గింజుపల్లి వెంకట్రావు, కన్నెబోయిన రామలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కిషోర్, అప్పారావు, కృష్ణ, డీఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో జగనన్న సురక్ష

జగ్గయ్యపేట అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమం పట్టణంలో గురువారం 8వ సచివాలయం (13,14 వార్డులు) వద్ద జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు క్యాంపు ప్రారంభమవుతుంది. ఈ క్యాంపులో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొంటారు. ఈ క్యాంపుల్లో ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండానే అర్హులైన వారికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్, రైస్ కార్డుల్లో మార్పు చేర్పులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు తదితర 11 రకాల సర్టిఫికెట్లు, సర్వీసులు అందజేస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నందిగామ: పట్టణ పరిధిలోని 8వ సచివాలయం వద్ద గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాఘవాపురం గ్రామం లో సచివాలయం వద్ద, లింగాలపాడు గ్రామంలోని సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

జగ్గయ్యపేట: మండలంలోని పోచంపల్లి గ్రామంలో గురువారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ బుధవారం తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొంటారని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నందిగామ: దులాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని మధిర రోడ్డులో దులాస్ ట్రస్ట్ కార్యాలయంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ మృతి

నందిగామ: పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. ఘటనకు సంబంధించి ఎస్ఐ పండు దొర తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారు హనుమంతుపాలెంకు చెందిన వట్టేపు అవ్వమ్మ (38) కడుపునొప్పి తాళలేక మంగళవారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన బంధువులు వైద్యశాలకు తరలించారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై బుధవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పండుదొర తెలిపారు.

ప్రణాళికతో విద్యను అభ్యసిస్తే విజయం తథ్యం



సదస్సులో ప్రసంగిస్తున్న నాగేశ్వరరావు, వేదికపై తేజోవతి, జగదీష్, శ్రీధర్ తదితరులు

విజయవాడ కల్చరల్: విద్యార్థులు ప్రణాళిక, సంకల్పం, పట్టుదలతో కృషి చేస్తే విజయం తథ్యమని యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ మేనేజర్ ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. యువజన సర్వీసుల శాఖ ఎన్టీఆర్, కృష్ణా జిల్లా శాఖల ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డులోని శారదా కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అంశంగా అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. సదస్సును ప్రారంభించిన నాగేశ్వరరావు మాట్లాడుతూ లక్ష్య సాధనే ధ్యేయంగా చిత్తశుద్ధి, ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలన్నారు. అధ్యాపకులను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు తేజోవతి, జగదీష్‌లు మాట్లాడుతూ.. ధ్రుడమైన మనస్సు, మంచి స్నేహితులు, మంచి ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. అవగాహన సదస్సులో కళాశాల కరస్పాండెంట్ ఎస్ వరప్రసాద్, ఇంటర్మీడియెట్ విభాగం ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పట్లెల రోజేష్‌బాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరశర్మ పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన పలు సమస్యలకు నిపుణులు పరిష్కారాలు చెప్పారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ అందజేస్తున్న ఫాదర్ అనిల్

గుణదల(విజయవాడతూర్పు): పేద విద్యార్థులను ప్రోత్సహించే దిశగా తమ కళాశాల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఆంధ్రలయోల కళాశాల ఎగ్జామ్ కంట్రోలర్ ఫాదర్ అనిల్ అన్నారు. కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. సామాజిక, ఆర్థిక పరిస్థితులను అధిగమించి విజయ పథంలో సాగాలన్నారు. పేద విద్యార్థులను ప్రోత్సహించే దిశగా కళాశాల భౌతికశాస్త్ర విభాగం పలు ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దీనిలో భాగంగా 80 మంది పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ ఉచితంగా అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకులు టి.శ్రీకుమార్, ఎంసీ రావు, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అకాడమీ నిర్వాహకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థులు పట్టుదలతో పాటుగా ప్రణాళిక ప్రకారం చదివితే ఏ పోటీ పరీక్షల్లోనైనా విజయాలు సొంతం చేసుకోవచ్చని సిద్ధార్థ అకాడమీ కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు చెప్పారు. సిద్ధార్థ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు సిద్ధార్థ అకాడమీ ఆధ్వర్యంలో జేఈఈ మెయిన్స్ స్టడీ మెటీరియల్‌ను బుధవారం కళాశాల ఆవరణలో ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపేందుకు ఈ స్టడీ మెటీరియల్ ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. సిద్ధార్థ అకాడమీ అకడమిక్ సలహాదారుడు ఎల్‌కె.మోహనరావు, సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెండేళ్లలో రూ.3 వేల కోట్ల వ్యాపార అభివృద్ధి

- కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు
- సహకరించిన అందరికీ కృతజ్ఞతలు



జగ్గయ్యపేట అర్బన్: ప్రతిష్టాత్మకమైన కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రెండేళ్ల కాలవ్యవధిలో నేటి వరకు రూ.3 వేల కోట్ల వ్యాపార అభివృద్ధి సాధించి, రూ.10,150 కోట్ల టర్నోవర్‌తో బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపించినట్లు కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా తన రెండేళ్ల కాల వ్యవధి ముగిసిన సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన రెండేళ్ల కాల వ్యవధిలో సుమారుగా 180 సహకార సంఘాలకు నూతన భవనాలు, 9 బ్రాంచ్‌లకు బిల్డింగ్‌ల నిర్మాణం, మౌలిక వసతులు కల్పించామన్నారు. రైతులకు సరళీకృత విధానాలతో సత్వర రుణాలు అందేలా ఏర్పాటుచేసి బ్యాంకు దేశంలోనే 5వ అతిపెద్ద సహకార బ్యాంకుగా జాతీయ స్థాయిలో నిలిచేలా కృషి చేసినట్లు తెలిపారు. ఈ విజయాల్ని సాధించడానికి తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు, నాకు తోడుగా నడిచిన సహకార సంఘాల అధ్యక్షులు, సిబ్బంది, సీఈవో శ్యామ్ మనోహర్‌కు, సీనియర్ ఆఫీసర్స్‌కు, ఖాతాదారులకు, రైతులకు, కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా నన్ను నమ్మి ఈ పదవి నియామకానికి కృషిచేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దాసాంజనేయ ఆలయ హుండీ ఆదాయం రూ.12.11 లక్షలు



హుండీ కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు రూ.12 లక్షల 11 వేల 729 నగదు, 75 యూఎస్ డాలర్ల ఆదాయం లభించింది. మాచవరం దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో బుధవారం దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ, కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షణలో హుండీ కానుకల లెక్కింపు జరిగింది. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సభ్యులు సంప్రదాయ దుస్తుల్లో లెక్కింపులో పాల్గొన్నారు. 112 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని ఇన్‌స్పెక్టర్ అనురాధ తెలిపారు. హుండీ లెక్కింపులో ధర్మకర్తలు బండి నాగజ్యోతి, కోలా సురాంబ, యక్కల మారుతి, ప్రత్యేక ఆహ్వానితులు పోలుకొండ శ్రీనివాసరావు, భక్తులు సేవ సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

మంచినీటి రిజర్వాయర్‌కు నేడు శంకుస్థాపన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 46వ డివిజన్ కొండ ప్రాంతంలోని యానాదుల బజార్‌లో నూతన మంచినీటి రిజర్వాయర్ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన జరుగుతుందని వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు వెన్నం రజనీకుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం 9.15 గంటలకు కేటీ రోడ్డులో భీమన వారి వీధి వద్ద రిజర్వాయర్ పనులకు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో పాటు పలువురు కార్పొరేటర్లు, అధికారులు హాజరవుతారని చెప్పారు.

ఖోఖో సంఘ సమావేశం వాయిదా

విజయవాడ స్పోర్ట్స్: ఈ నెల 30వ తేదీన జరగాల్సిన ఉమ్మడి కృష్ణా జిల్లా ఖోఖో అసోసియేషన్ సంఘ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు కృష్ణాజిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గన్నవరంలోని రోటరీ హాల్‌లో ఈ సమావేశం నిర్వహిస్తామని ఇటీవల ప్రకటించారు. కొన్ని అనివార్య కారణాలతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రసాద్ వెల్లడించారు.

అధికారులకు మెమోలు జారీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి నివేదనశాలలోకి సాధారణ భక్తుడిని అనుమతించడంపై దుర్గగుడి ఈవో భ్రమరాంబ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై నివేదన శాఖ సూపరిండెంటెంట్, ఇతర అధికారులను వివరణ అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి నివేదనశాలలో జరిగిన ఘటనపై అర్చకులను ఆరా తీశారు. సీసీ కెమెరా పుటేజీని పరిశీలించడంతో పాటు తదుపరి విచారణ నిమిత్తం పుటేజీని తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని వైదిక కమిటీని ఆదేశించడంతో పాటు సంబంధిత అధికారులు, పర్యవేక్షకులు గురువారం నాటికి వివరణ ఇవ్వాలని మెమోలు జారీ చేశారు.

ఆర్థిక సాయం అందజేత



గుణదల(విజయవాడతూర్పు): పేదలకు బాసటగా నిలిచేందుకు స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించామని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 13వ డివిజన్ ఆర్టీసీ కాలనీకి చెందిన తిరుమాని నాగప్రసాద్ కుమార్తె వివాహం నిమిత్తం పది వేల రూపాయలను ఆర్థిక సాయం అందించామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఊకోటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ నిర్మాణ పనులకు శ్రీకారం



యూజీడీ నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సుదీర్ఘ కాలంగా ఉన్న డ్రైయినేజీ సమస్యలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. 19వ డివిజన్‌లోని ఫకీరుగూడెం పంపుల కృష్ణా రోడ్డు, గాజుల వెంకటేశ్వరరావు రోడ్డుల్లో కొత్తగా యూజీడీ పైప్‌లైన్ పనులను బుధవారం ఆ డివిజన్ కార్పొరేటర్ రెహానా నాహీద్ స్థానికులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ ప్రాంతంలో డ్రైయినేజీ సమస్య ఉన్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ దృష్టికి తీసుకు రాగా, ఆయన చొరవతో పనులు చేపట్టామన్నారు. కొత్తపైప్‌లైన్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.6 లక్షల అంచనాతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో చింతగుంట విజయ్ ఆనంద్‌కుమార్, నాహీద్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు టాక్స్ మినహాయింపు

నందిగామ: ఇన్ కమ్ టాక్స్ పరిధిలోకి వచ్చే పెన్షనర్ల కు జూలై నెల నుంచే ప్రతి నెలా ఇన్ కమ్ టాక్స్ మినహాయింపు జరుగుతుందని నందిగామ సబ్ ట్రెజరీ అధికారి కె.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు పెన్షనర్లకు ప్రతి సంవత్సరం నవంబర్ మాసం నుంచి నాలుగు నెలల పాటు ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు జరిగేది. దానిని ఈ ఏడాది జూలై మాసం నుంచే మినహాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సవరణను పెన్షనర్లు గమనించాలన్నారు. పూర్తి వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించవచ్చున్నారు

వాహనాల తనిఖీ

వీరులపాడు: వీరులపాడు గ్రామంలో బుధవారం ఎస్ఐ మహాలక్ష్మణుడు వాహనాల తనిఖీ చేపట్టారు. ముందుగా పరిమితికి మించి ప్రయాణీకులతో వస్తున్న ఆటోలను గుర్తించి డ్రైవర్‌లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలలో నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించటం వల్ల ప్రమాద సమయంలో తీవ్రత అధికంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా వాహనచోదకులు రోడ్డు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలన్నారు. నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లౌడ్ స్పీకర్‌లు పెట్టి వాహనాలు నడుపుతూ పట్టుబడితే సహించేది లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.